


విస్తారంగా వర్షాలు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలో గత వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో వేరుశెనగ రైతుల పనులకు ఆటంకం కలుగుతోంది.వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగ పంట దిగుబడి లేకుండా మొక్కలు కుల్లి పోయే పరిస్థితి వస్తుందని రైతులు అంటున్నారు.



కురుస్తున్న వర్షం

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి రక్షణ

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద, విధ్వేష రాజకీయాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీల పిలుపు మేరకు రాజకీయ ప్రచార భేరి కార్యక్రమాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా 'మోడీని గద్దె దించుదాం.. దేశానికి కాపాడుకుందాం' అన్న నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

విఆర్ పురం : మండల కేంద్రంలోని రేఖపల్లిలో సిపిఎం స్థూపం నుండి రేఖపల్లి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించి, అక్కడ అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు ఘన నివాళి అర్పించారు. అనంతరం ప్రచార భేరిని ప్రారంభించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ విభజన చట్టంలో హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫంకు. సత్తిబాబు, గుండుపూడి లక్ష్మణరావు, కమ్మ చిచ్చు సత్యనారాయణ, ఆత్మకూర్ కాంతారావు, నెర్రు బోయిన రమణ, ఏర్ల నాగేశ్వరరావు. నల్లారపు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీపు జాతా

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో కళ్యాణ మండపం నుండి ప్రచార భేరిలో భాగంగా జీపు జాతా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్రానికి వ్యతిరేకంగా నాలుగు రోడ్ల కూడలిలో నిరసన చేపట్టారు. సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, పి.అప్పలనర్స మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుండి గిరిజనులకు తొలగించాలనే ఉద్దేశ్యంతో మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించిందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రత్యేక గిరిజన హక్కులు, చట్టాలను బలహీన పరుస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న గిరిజన ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తే అణిచి వేస్తోందన్నారు. ప్రజాస్వామ్య, లౌకికవాదం, సామాజిక న్యాయం రక్షణకు సిపిఎం, సిపిఐ అల్లూరి జిల్లా కమిటీ ఈనెల 14 నుండి 25 వరకు ప్రచార బేరి జీపు జాతా చేపడుతున్నట్లు చెప్పారు. 24న పాడేరు, 25న అరకువేలిలో నిర్వహించి బహిరంగ సభకు జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-1 సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, నాయకులు ఎంఎం శ్రీను, నరసయ్య, నారాయణ, జనాబంధు, డోంబ్రు, గిరిజన మహిళా సంఘం నాయకులు సీస విజయలక్ష్మి, సోనియా ఈశ్వరి, మీనా, దసుదా, దేవి, ముఠా కార్మికులు, గిరిజనులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో జీపుజాతాలో పాల్గొన్న అప్పలనర్స తదితరులు



కూనవరంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

కూనవరం : సిపిఎం మండల కార్యాలయం ఎదుట అంబేద్కర్ చిత్ర పటానికి పార్టీ సీనియర్ నాయకులు నానుపల్లి వెంకటేశ్వర్లు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ వ్యక్తి బిఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజా భేరి కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు తలగాని నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారాం రామయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, కొండా ఈశ్వర్, బాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, షణ్ముఖరావు, సుధారాణి పాల్గొన్నారు.

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన

సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం, సిపిఐ చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు, సిపిఎం నాయకులు బోనంగి చిన్నయ్యపడాల్, సిపిఐ నాయకులు పి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీలేరులో జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ వాల్మీకిలను తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎస్‌టి జాబితాలో చేర్చడం దారుణమన్నారు. జిల్లాలో హైడ్రో ప్రాజెక్టు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి ధనుంజయ్, సిపిఐ మండల కార్యదర్శి కె.సత్తిబాబు, సుంకర విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

ఎటపాక : ఎటపాక మండలాన్ని ముంపు జాబితాలో చేర్చాచాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎటపాక మండలంలో సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరిని ప్రారంభించారు. సీతపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మరుమూరు నుండి పాద యాత్ర చేపట్టి నందిగామ, గౌరీదేవిపేట, గన్నవరం వరకు నిర్వహించారు. పాదయాత్ర బందానికి టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎలీషాలా నాగరాజు, వరద బ్రహ్మం, వాసం రాము, వల్లభ నేని సత్య నారాయణ, ఎంపిటిసి కంటే రాజు పాల్గొన్నారు.


కొయ్యూరు : మండలంలోని మంప గ్రామంలో సిపిఐ నాయకులు పాత్రయాత్ర ప్రారంభించారు. ముందుగా రాజేంద్రపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ఈ పాదయాత్ర ఈనెల 20న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామమైన గానుగుల వరకు సాగుతుందని తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, ధన్యంరాజు కనకరాజు, మొల్ల నాగరాజు, గండేపల్లి నూకరాజు, ఇరవాడా రాజుబాబు, వి య్యపు నానాజీ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

పోలవరం నిర్వాసితులకు కేంద్రం ద్రోహం

ఎటపాక : లక్షలాది గిరిజనుల బతుకులను ఛిద్రం చేస్తూ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు వల్ల సమిధులవుతున్న నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా ద్రోహానికి పాల్పడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. మండలంలోని గుండాల కాలనీ, తోటపల్లి, రాంగోపాలపురంలో జరిగిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలలో సీతారాం పాల్గొన్నారు. అనంతరం బీజేపీ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలకు నిరసనగా సిపిఎం సిపిఐ చేపట్టిన ప్రచారభేరిని గుండాల కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తూ దేశంలో బిజెపి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా తన ఆప్తమిత్రుడు అదానికి కట్టబెడుతుందని తెలిపారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వకపోయినా కేంద్రాన్ని ప్రశ్నించకుండా, పోరాడకుండా జగన్ ప్రభుత్వం నాలుగేళ్ల నుండి నిర్వాసితులను మోసం చేస్తుందని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులను మోసం చేయడంలో బిజెపి, వైసిపి, టీడీపీలు ఒకే జట్టుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దేశానికి పెను ప్రమాదంగా మారిన బీజేపీని దేశం నుండి తరిమేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, నాయకులు డేగల మాధవరావు, కాకా అర్జున్, పులుసు బాలకృష్ణ, ఐ పద్మ, ఆకిశెట్టి రాము, హరనాథ్, సవలం రాము, అపకా సమ్మక్క, లింగాల వెంకన్న, గాడిద ముక్కోటేశ్వరరావు, తోట శ్రీను, సర్పంచ్ మోసం రాజులు పాల్గొన్నారు.



సీలేరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

2279.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

ఎపి జోన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు జల విద్యుత్ కేంద్రాలకు 2023-24 సంవత్సరానికి గాను 2279.5 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి టార్గెట్‌గా కేంద్ర విద్యుత్ అధారిటీ నిర్దేశించిందని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బి. శ్రీధర్ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో 626 మిలియన్ యూనిట్లు, పొల్లూరులో 1084 మిలియన్ యూనిట్లు, సీలేరులో 470 మిలియన్ యూనిట్లు, డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో 99.5 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయాలని టార్గెట్‌లు నిర్దేశించినట్లు చెప్పారు. సీలేరు కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఆరు నుంచి ఏడు మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు జరుగుతుందని వెల్లడించారు. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్స్‌లో నీటి నిల్వలు 14 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, జూన్ నెల ఆఖరి వరకు ఉన్న నీటి పొదుపుగా వాడుకుంటూ గ్రిడ్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీధర్

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- తెగిపడిన బాలిక కాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలం ఇందుకూరుపేట నుంచి గోకవరం వెళ్లే రోడ్డులోని మడిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ, ఆర్ అండ్ బి రహదారి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒక బాలిక కాలు తెగిపడింది. దేవీపట్నం ఎస్ఐ కె.వెంకట నాగార్జున కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం అచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన మధురెడ్డి నాగేంద్ర, పి.రాజశ్రీ, పి.మహేష్, జి.లావణ్య ద్విచక్ర వాహనాలపై గోకవరం మండలం కృష్ణుడుపాలెం శుక్రవారం వెళ్తున్నారు. మడిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ సమీపంలోకి వచ్చే సరికి గోకవరం వైపు వెళ్తున్న బొలేరా వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న నాగేంద్ర, రాజశ్రీ, మహేష్, లావణ్య తీవ్రంగా గాయపడ్డారు. అందులో లావణ్య కుడికాలు శరీరం నుండి తెగిపడింది, క్షతగాత్రులను తొలిత గోకవరం ఆసుపత్రికి తరలించగా ప్రాథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవీపట్నం ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన బాలిక

ఎమ్మెల్యే ధనలక్ష్మిని అడ్డుకున్న ఆదివాసీలు

-అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసే హక్కు లేదని నినాదాలు – పలువురు గిరిజన నాయకులు అరెస్టు


ప్రజాశక్తి-అడ్డతీగల: బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ విడుదల చేసిన జిఒ 52ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మిని ఆదివాసీ నాయకులు, గిరిజనులు అడ్డుకున్నారు. ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించి స్థానిక అంబేద్కర్ సెంటర్ నుండి ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తుండగా.., ఎమ్మెల్యే వస్తున్నారని, ఆమె వచ్చిన తరువాత మీరు పూలమాల వేయాలని అక్కడున్న కొంత మంది గిరిజనేతరులు ఆదివాసీ నాయకులతో వాదనకు దిగారు. ఆగ్రహించిన గిరిజన నాయకులు ఆదివాసీ ద్రోహి అయిన ఎమ్మెల్యేకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసే హక్కు ఎక్కడదని ప్రశ్నించారు. గిరిజన హక్కులు తాకట్టుపెట్టడంపై సమాధానం చెప్పిన తర్వాతనే పూలమాల వేయాలని ఆందోళన చేశారు. పోలీసుల సహకారంతో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేస్తుండగా, జెఎసి నాయకులు అడ్డుపడ్డారు. దీంతో పోలీసులకు జేఏసీ నాయకులకు మధ్య ఘర్షణ, తోపులాట జరిగింది. మహిళలని చూడకుండా పోలీసులు దౌర్జన్యంగా లాగి విసిరిపడేశారు. గిరిజన నాయకులను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి అడ్డతీగల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో ఆదివాసీ ఉద్యమాలను ఆపలేరంటూ గిరిజన నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, గిరిజన సంఘం, ఆదివాసీ జెఎసి నాయకులు టి.బాబురావు, ఇ.సిరిమల్లె రెడ్డి, ఐవి.రమణ, ఎస్.సప్నకుమారి, ఎం.వాణిశ్రీ, వి.నరసన్న దొర, పల్లాల అబ్బాయి రెడ్డి, తామర బాజీ, జర్త కృష్ణారెడ్డి, ఎస్ సత్తిరెడ్డి, కోసూరు శ్రీనివాస్‌రెడ్డి, చెదల దినేష్ రెడ్డి, జర్త వెంకటరమణరెడ్డి, వై వీరభద్రరావు, పందుల కామరాజు, తీగల బాబూరావు, వై.వెంకటరమణ, కురుసం వరలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు ఖండన

రాజవొమ్మంగి : అడ్డతీగలలో గిరిజన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆదివాసీ జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం రాజవొమ్మంగిలో జరిగిన సమావేశంలో జెఎసి నాయకులు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు, గంపా నాగరాజు మాట్లాడుతూ, అడ్డతీగలలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిని బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చుతూ తీసుకొచ్చిన 52 జీవోపై ప్రశ్నించిన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావుతో పాటు మరికొంతమంది జెఎసి నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఇటీవల రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో శాంతియుత ఆందోళన చేస్తున్న జెఎసి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.జగన్నాథం, జి పెద్దిరాజు, వజ్రపు అప్పారావు, బి చిట్టిబాబు, ఎన్ ఎర్రయ్య, ఈ లక్ష్మణ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఎమ్మెల్యే ధనలక్ష్మి



నినాదాలు చేస్తున్న ఆదివాసీలు



సమ్మె నోటీసును ఇస్తున్న నాయకులు, పారిశుధ్య కార్మికులు

28 నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె

సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని సూపరింటెండెంట్ కె.కృష్ణారావు, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు, నారాయణలకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. కనీస వేతనాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె నోటీసులో వేతన సమస్యలను వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో పాడేరు జిల్లా ఆసుపత్రి, అరకు వేలి, చింతపల్లి, ముంచంగి పుట్టు,ప్రైమరీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా ఆసుపత్రిలో సానిటేషన్ (పారిశుధ్య), సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనాలు 16,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాల నుండి ప్రావిడెంట్ ఫండ్ కోత విధించి మిగిలిన జీతం ఇవ్వవలసి ఉండగా, సదరు కాంట్రాక్టర్ కేవలం శానిటేషన్ కార్మికులకు రూ.9000 నుండి 10,700లు మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. సెక్యూరిటీ కార్మికులకు రూ.8,366, చింతపల్లి, ముంచంగిపుట్టు కార్మికులకు కేవలం రూ.9000 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన జీతం ప్రకారం పీఎఫ్. ఈఎస్ఐ జమ పోను ప్రతీ కార్మికునకు కనీస వేతనం రూ.13,900 జీతం ఇవ్వాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్ తక్కువ వేతనం ఇస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక యూనియన్ కార్యదర్శి ఆర్ ముత్యాలమ్మ, కార్యవర్గ సభ్యులు గాటి, పుణ్యవతి, కొండమ్మ, నాగమణి, సింహాచలం, లక్ష్మణ్ ,శ్రీధర్ పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న పిఒ

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ కార్యాలంయలో అంబేద్కర్ చిత్రపటానికి ఇన్చార్జ్ సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పిఒలు ప్రభాకరరావు, వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి హేమలత, పిహెచ్ఒ అశోక్, డిఎస్ఒ అప్పారావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, మతోన్మాద బీజేపీని అధికారం నుండి గద్దె దించాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు పొద్దు బాలదేవ్, కొర్రా మగ్గన్న, టీ.హరి పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి సూర్యనారాయణ, యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.నారాయణ, ఎస్.బాలకృష్ణలు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. రంగిలిసింగిలో గుంట సీమ సర్పంచ్ జి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పి.డుంబులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు కే సుబ్బారావు, ఎం.స్వామి, ఏం.సింహాద్రి, మాజీ జెడ్పిటిసి ఎం.శ్రీరాములు, వైసీపీ మండల అధ్యక్షుడు ఎస్ గోపాల్, ప్రతాప్, అర్జున్, సీతారాం, పరశురాం, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక పెట్రోల్ బంకు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు. సర్పంచ్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

అరకులోయ: మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం అరకులోయ అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అరకులోయ తహసిల్దారు వేణుగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వి.త్రినాథ్, పద్మావతి గార్డెన్ మేనేజర్ లకే బొంజు బాబు, కూడా సింహాద్రి, అప్పన్న, లైకోన్, ఆనంద్, పట్టాసి ప్రసాద్, ప్రతాప్ కుమార్, కొర్రా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో సిహెచ్. శ్రీనివాసరావు. పరిపాలనాధికారి డిఎన్వి రమణ. పీహెచ్ఓ కే చిట్టిబాబ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, డాక్టర్ రాధిక ఇతర అధికారులు పాల్గొన్నారు. రంపచోడవరం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, పెంటపాటి అనంతమోహన్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన నాయకులు కార్యకర్తలు రాజవొమ్మంగిలో అంబేద్కర్ చిత్రపటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ జి రమణి, ఎంపీపీ జి.వెంకటలక్ష్మి, జెడ్పిటిసి వి జ్యోతి, ఆయా సంఘాల నాయకులు వి బాలకృష్ణ, టి సూరిబాబు, మోర్తా బుజ్జి, పి కిరణ్, కామరాజు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి యూత్ ఆధ్వర్యంలో బోదులూరు రోడ్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ జాకబ్, జడ్పిటిసి సభ్యులు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవి కుమార్, అఖిల పక్ష నాయకులు సత్తి సత్యనారాయణ రెడ్డి, భీసెట్టి అప్పాజీ, సత్యనారాయణ రెడ్డి, యూత్ నాయకులు అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో అంబేద్కర్ చిత్ర పటానికి అనుసూచిత్ జాతి సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చదలవాడ కృప కుమార్, దాసరి వెంకటరమణ పూస శ్రీను, ఎస్సీ హాస్టల్ వార్డెన్ తాతాజీ, ఉపాధ్యాయులు శామ్యూల్ పాల్గొన్నారు. చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రత్న మాణిక్యం, కళాశాల సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో ఎపిఎస్ఇబి ఎస్సి, ఎస్‌టి అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పొన్నూరు గ్రామంలో పేద విద్యార్థులకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ చేతుల మీదగా పుస్తకాలు పెన్సిల్లు పెన్నులు చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ దూలపల్లి బాబురావు,. భీమవరం బాలకృష్ణ నరసింహ పాల్గొన్నారు.

విఆర్ పురం : మండలంలోని రేఖపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ పూనం సరోజినీ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, సచివాలయ సెక్రటరీ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఉపాధ్యాయ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదమాకవరం సచివాలయంలో ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఎస్టి ఎస్సి అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వమించారు. ఏపీ జెన్కో ఎస్ఈ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీటీసీ పిల్ల. సాంబమూర్తి, పాల్గొన్నారు. జీకే వీధి మండలం దారకొండ, సీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద దారకొండ సర్పంచి నడిగట్ల రాజు, సీలేరు ఇన్‌ఛార్జి సర్పంచ్ కే వల్లి ప్రసాద్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వై రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం వేసవిలో ఎండలు మండుతున్న పరిస్థితుల్లో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆరుబయట ఏదైనా పనులుంటే ఉదయం పదిగంటల్లోగా ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. అత్యవసరమైతే తగు జాగ్రత్తలు తీసుకుంటే తప్ప, సాయంత్రం నాలుగు గంటల తర్వాత గాని బయటకు రావొద్దని సూచించారు.

కొన్ని రోజులపాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు అవసరమన్నారు. ఎక్కువగా ద్రవపదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కార్పొరేటర్ రాజాన రామారావు, పి నాగప్రసాదరావు, వద్ద పాల్గొన్నారు.

జ్యూట్ యాజమాన్యానికి కోర్టులో చుక్కెదురు

ప్రజాశక్తి -తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యానికి హైకోర్టులో చుక్కెదురైనట్లు చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎస్ అప్పలరాజు, అధ్యక్షులుసియస్ నరసింహరాజు, సింగిడి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి ర వెంకటరమణ వెల్లడించారు. శుక్ర వారం లేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చిట్టి వలస జ్యూట్ మిల్లు యాజమాన్యం, ప్రభుత్వం2020 లో కుదుర్చుకున్న ఒప్పందం చెల్లదని పేర్కొంటూ తమ సంఘం వేసిన కేసుకు సంబంధించి ఈ నెల 11న విచారణ జరిగినట్లు వివరించారు.

కౌంటర్ దాఖలు చేయాలని గతంలోనే యాజమాన్యానికి కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ నిరాకరించడంతో యాజమాన్యంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. యాజమాన్యం తరఫున వాదించే న్యాయవాది తప్పుకోవడంతో యాజమాన్యానికి కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు కార్మిక సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కేసును మరలా ఏప్రిల్ 25వ తేదీకి వాయిదా వేసినట్లు వివరించారు

టిడిపి హయాంలోనే దోపిడీ : ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: టిడిపి హయాంలో రాష్ట్రాన్ని దోచుకుంది అయ్యన్న, చంద్ర బాబులేనని ఎమ్మెల్యే గణేష్ విమర్శించారు. మీడియాకు ఆయన పంపిన వీడియోలో మాట్లాడుతూ, అమలాపురంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు చేసిన విమర్శలపై ఎమ్మెల్యే స్పందించారు. టీడీపీ హయాంలో ఇసుక, నీరు చెట్టు పథకంలో దోపిడీ చేశారన్నారు. 2014లో 600 హామీలు ఇచ్చి 60 హామీలు కూడా నెర వేర్చలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నా మన్నారు. ఏదో విధంగా తమ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ గ్రామంలో అయ్యన్నపాత్రుడు సమావేశాలు పెట్టి విమర్శలు చేస్తారో వెంటనే నాయకులు అదే రీతిలో విమర్శించాలన్నారు.

కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షునిగా శ్రీనుబాబు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షులుగా గంట్ల శ్రీనుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు..సంఘం నాయకులు సినీ డైరెక్టర్ యాదకుమార్, అధ్యక్షులు క్యాలు జనార్దన్ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనుబాబు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యయాపాలెం సింధూర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో జనార్దన్, ఇతర సంఘం పెద్దలు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షునిగా అనేక సేవా, సాంస్కృతిక సంఘాలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న శ్రీనుబాబును రెండు వేల మందికి పైగా కళాకారులున్న విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘానికి గౌరవాధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. అతని అమూల్యమైన సేవలుసంఘానికి వినియోగించుకుంటామన్నారు.ఇదేవిధంగా సంఘం నిర్వాహక కార్యదర్శిగా పక్కి అరుణ సాయికుమార్ (శాస్త్రీయ నృత్య విభాగం) ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బాలు, విజయ, ఉపాధ్యక్షులుగా తాళ్లాప్రోలు సందీప్‌లను నూతనంగా నియమించినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీనుబాబు మాట్లాడుతూ, కళాకారులందరినీ సమన్వయపరిచి, వారి సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్న కళాకారుల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.నాగరాజు పట్నాయక్, ఈటీవీ ఫేమ్ సంగీత కళాకారులు ధనంజయ్, కీరవాణి ప్రసాద్, నంది అవార్డు గ్రహీతలు శివజ్యోతి, కన్నం వెంకటరమణారావు, డేవిడ్, కల్యాణ్ పాల్గొన్నారు.

బోయ /వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై

మన్యంలో మిన్నంటిన నిరసనలు





పాడేరు, పెదబయలులో మహాదీక్షల్లో ఆదివాసీ జెఎసి నేతలు

ప్రజాశక్తి-పాడేరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాక్షిగా పాడేరు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పాడేరు అంబేద్కర్ సెంటర్లో బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాదీక్ష చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసేందుకు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి వస్తున్నట్లు తెలిసి నిలదీసేందుకు జేఏసీ నాయకులు సంసిద్ధులయ్యారు. ఎమ్మెల్యే అక్కడకు వస్తే నిరసనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటాయని ముందుగానే పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అంబేద్కర్ విగ్రహం వద్దకు రాలేనట్లు తెలుస్తోంది. వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ విజయ కుమారి వాహనాన్ని జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. జేఏసీ కన్వీనర్ రామారావుదొర, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాదీక్షలో మాజీ ఉద్యోగ సంఘ నేతలు ఆర్.నాగభూషణం, ఎస్ గంగరాజు, మాజీ మంత్రి మణి కుమారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొన్నారు.

అరకులోయ:బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా వివిధ ప్రజా సంఘాలు, అంబేద్కర్ సేవా సమితి, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు, ఆదివాసి జేఏసీ ప్రతినిధులు శుక్రవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించి గిరిజనుల గొంతు కోయవద్దని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వి.త్రినాథ్, పద్మావతి గార్డెన్ మేనేజర్ లకే బొంజుబాబు, కూడా సింహాద్రి, అప్పన్న, లైకోన్, ఆనంద్, పట్టాసి ప్రసాద్, ప్రతాప్ కుమార్, కొర్రా మాణిక్యం, జన్ని సింహాచలం, జడ్పిటిసి రోషిని, పాంగి రాజారావు, దొన్నుదొర పాల్గొన్నారు.

పెదబయలు రూరల్ :మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి వెచ్చంగి కొండయ్య మాట్లాడుతూ, అసెంబ్లీలో తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ, ఇప్పటికైనా గిరిజన ఎమ్మెల్యేలు స్పందించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి మండల నాయకులు మరిచెట్టు పోతురాజు, సీతగుంట పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ . గంగాధరం, గిరిజన సంఘం నాయకులూ కొమ్మ పృథ్వీరాజు, గిరిజన సంఘం మహిళ నాయకురాలు బోండా కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : బోయలను బెంతుఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చే జీవో నెంబర్ 52 ను రద్దు చేయాలని చింతూరు ఆదివాసి డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో చింతూరు, కూనవరం, ఎటపాక, విఆర్ పురం మండలాల్లో మెగా బైక్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. చింతూరు నుంచి అంబేద్కర్ విగ్రహానికి, ఆదివాసీ నాయకులు అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, మల్లు దొర, గంటం దొర విగ్రహాలకు పూలమాలలు వేసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు జల్లి నరేష్, పులి సంతోష్ కుమార్, సీసం సురేష్, చింతూరు ఎం.పి.పి సవలం అమల, కునవరం ఎంపిపి పాయం రంగమ్మ, జెడ్పిటిసి గుజ్జ, కుంజ. సీతారామయ్య, కొమరం పెంటయ్య పాల్గొన్నారు.

ఎటపాక : బోయ వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ఏపీ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని గిరిజన జేఏసీ డిమాండ్ చేసింది. మండలంలోని మాధవరావు పేటలో పొడియం రత్నరావు, కాకా లక్ష్మణ్ అధ్యక్షతన శుక్రవారం జెఎసి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాకా కామేశ్వరి, జెఎసి నాయకులు కాకా అర్జున్, ఎంపిటీసీ పెనుబల్లి కృష్ణకుమారి, సర్పంచ్‌లు కాకా వీర్రాజు, బుద్దా ఆదినారాయణ, గుండి సీతలక్ష్మి, ఇరప భద్రమ్మ, పొడియం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో మాట్లాడుతున్న గిరిజన ఉద్యోగ జెఎసి నేత



ఎటపాకలో మాట్లాడుతున్న గిరిజన జెఎసి నేత

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా నేషనల్ హెల్త్ అండ్ వెల్ నెస్ డే పురస్కరించుకొని సర్వసిద్ధి పిహెచ్‌సి ఎనిమిది గ్రామ సచివాలయాల్లో ఆరోగ్యంపై అవగాహన శిబిరాలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్‌లు ఎస్.ఎస్.వి.శక్తి ప్రియ, డాక్టర్ వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా ఇంఛార్జి నోడల్ ఆఫీసర్ పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్ ఎస్.రాయవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభనుద్దేసించి మాట్లాడుతూ, యోగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వడదెబ్బ తగిలితే. శరీరంనకు కలిగే నష్టం, కీటక జనిత వ్యాధులయిన డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు రాకుండానూ, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిలువ వున్న పాత్రల పై తప్పనిసరిగా మూతలు ఉంచాలన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 14 నుంచి 20 వరకు జరుగనున్న వారోత్సవాలను దివీస్, భద్రతా విభాగం అధికారి చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. 'జాతీయ అవస్థాపన వృద్ధికి అగ్నిభద్రతపై అవగాహన' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారోత్సవాలకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకాధికారి జి శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుళ్లు జిఎస్‌కె రెడ్డి, టి వెంకటరావు, కె చక్రవర్తి, డ్రైవర్ ఆపరేటర్లు సిహెచ్‌విఆర్ మూర్తి, బి రామకృష్ణ పాల్గొన్నారు

విఆర్‌ఎల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పద్మనాభం : విఆర్‌ఎల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించినట్లు విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు పొట్నూరు సాధు తెలిపారు. ఇంటర్మీడియేట్ విద్యార్హత కలిగిన విఆర్‌ఎలకు ప్రమోషన్లు, కనీస వేతనం రూ.26వేలు అమలు, డిఎ, హెచ్ఆర్ఎ, ఇతర సౌకర్యాల కల్పన, అటెండర్లు, వాచ్‌మెన్‌లుగా ఉద్యోగోన్నతి అవకాశం, నామినీగా పనిచేస్తున్న విఆర్‌ఎల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

అందరి సహకారంతో చందనోత్సవం విజయవంతం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ త్రినాధరావు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానంలో ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వామి నిజరూప దర్శనం, చందనోత్సవ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛందసంస్థలు, ప్రజల సహకారంతో విజయవంతం చేస్తామని దేవస్థానం ఇఒ వి త్రినాధరావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యంగా కొండపైకి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని స్వచ్ఛంద సేవా సంఘాల వారి సేవలకు ఆటంకం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చందనోత్సవం రోజున సింహగిరిపై పారిశుధ్య పనులను జివిఎంసి సహకారంతో చేపట్టడం ద్వారా భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు.

ప్రయాణికుల రాకపోకలకు వీలుగా ఆర్‌టిసి బస్‌సౌకర్యం , అత్యవసర వైద్యశిబిరాలు, అందుబాటులో అగ్నిమాపక వాహనాలు, ఇతరత్రా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎసిపి భీమారావు, జివిఎంసి ఎనిమిదో జోన్ కమిషనర్ మల్లు నాయుడు, ఆర్‌టిసి డిఎం రాజశేఖర్, గ్రామీణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, వివిధ విభాగాల అధికారులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న వైద్యాధికారిణి

గిరిజనులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ఆధ్వర్యాన గుమ్మరేవులలో హెల్త్ అవేర్నెస్ కేంద్రం వద్ద శుక్రవారం ఆరోగ్యం మేళా నిర్వహించారు. గ్రామంలోని 209 మంది గిరిజనులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ రక్తపోటు (బిపి), మధుమేహం (షుగర్) వ్యాధుల పట్ల గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవి వచ్చిన రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ తరచూ ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాలు, అతి సార వ్యాధులు సోకిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స పొందాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, శిశువులకు పసరు మందులు, నాటు వైద్యం చేయించరాదని, అలా చేస్తే చిన్నారులు ప్రాణాలకే ముప్పు కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాణి, పోతురాజు, కుమారి, నాగమణి, సీత, ఈశ్వరి, గోవిందు, బాలకృష్ణ పాల్గొన్నారు.

గీతం వర్సిటీపై పోలీసుల తీరు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గీతం విశ్వవిద్యాలయం చుట్టూ అర్ధరాత్రి పోలీసులు మోహరించి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం దారుణమని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి అర్ధరాత్రి పోలీసులతో ఇంత రాద్ధాంతం చేస్తారా అని ప్రశ్నించారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో వారిని భయాందోళనలకు గురి చేయడం దారుణమన్నారు.

16న నిర్విరామ హాస్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 16న నగరంలోని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 12 గంటలపాటు నిర్విరామ హాస్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్రియేటివ్ కామెడీ క్లబ్, హాస్య కామెడీ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. హాస్య కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు మాట్లాడుతూ మనస్సును ఆహ్లాదపరిచే కామెడీతో రికార్డు సృష్టించాలని క్రియేటివ్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు వేముల భాస్కరాచారి, సంయుక్త కార్యదర్శి డిఆర్‌కె.రావు కలిసి 120కి పైగా అంశాలపై, ప్రేక్షకులు అడిగే వాటిపై హాస్య చలోక్తులు మేళవిస్తూ హాస్యవదానం నిర్వహిస్తారని తెలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సరికొత్త రికార్డును నమోదు చేయడం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు సాగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గౌరవ అతిథులుగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌లతో పాటు సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, స్టార్ మేకర్ లంక సత్యానంద్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

ప్రభాకర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సినీ దర్శకుడు ఆరిపాక ప్రభాకర్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దాడి సత్యనారాయణ, అధ్యక్షులు ఎం.కృష్ణకిషోర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎపి మా సభ్యులు వెంకట్ రెడ్డి, రమేష్ యాదవ్, శివజ్యోతి, డేవిడ్ రాజ్, నిర్మలభాను పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

విశాఖలో 41 డిగ్రీలు - మరో 3 రోజులు ఇంతే..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎండ వేడికి జనం అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల నుంచి విశాఖలో ఉష్ణోగ్రతలు నానాటికీ పెరుగుతున్నాయి. శుక్రవారం 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నగరంలో నమోదైంది. ఇంట్లోంచి అడుగు తీసి బయట పెట్టాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం రాత్రి వెల్లడించారు. నైరుతి గాలులు ఉన్నందున వేడి కొనసాగుతోందని చెబుతున్నారు. దక్షిణ కోస్తాలో ప్రస్తుతం ఆగ్నేయ గాలులు ఉండడంతో వేడి కాస్త తక్కువగా ఉంది. తూర్పు కోస్తా ప్రాంతంలో ఆగ్నేయ గాలులు ఇంకా అడుగుపెట్టలేదు. ఇవి ప్రవేశిస్తే వేడి కాస్త తగ్గే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వేడి గాలులతో అల్లాడుతున్న జనం

విశాఖ నగరంలో వేడి గాలుల తాకిడి తీవ్రంగా ఉంది. ఉదయం 10 గంటల నుంచి రోడ్లపైకి వచ్చేందుకు జనం భయపడుతున్నారు. వడగాల్పులకు అనేక చోట్ల వృద్ధులు, పిల్లలు గురౌతుండడం కనిపిస్తోంది. గతంలో మాదిరిగా ఎక్కడికక్కడ చలివేంద్రాలు విశాఖలో కానరావడం లేదు. జివిఎంసి గతంలో ఏప్రిల్‌లో చొరవ చేసి చలి వేంద్రాలను ఏర్పాటు చేసేది. ఈ ఏడాది ఎక్కడా ప్రారంభించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఎప్పటికప్పుడు చల్లని మజ్జిగ, మంచినీరు, కొబ్బరినీళ్లు తాగుతూ ఉండాలని, లేదంటే వడదెబ్బకు గురౌతారని వాతావరణ కేంద్రం అధికారులు నిరంతరం హెచ్చరిస్తూనే ఉన్నారు.

విశాఖలో సముద్రం ఉన్నందున కొంత చల్లగా ఉంటుందని, అయితే ప్రస్తుతం నైరుతి గాలులు, స్థానిక వాతావరణ కారణాలతో వేడి అధికంగా ఉందని అంటున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని వీరఘట్టంలో 43 డిగ్రీలు, రాజాంలో 42.93, తాడేపల్లిలో 42.28, రాయల్ చెరువులో 43.72, అమరావతిలో 42.31, చాగలమర్రిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి.

ఉక్కుపై బిజెపి వేయి నాల్కల ధోరణి

ఉధృత పోరుతో బుద్ధి చెప్పాలని సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రంలోని బిజెపి పాలకులు వేయి నాల్కల ధోరణి మరోమారు బహిర్గతమైందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం విమర్శించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్థే స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం ఇప్పుడే ప్రైవేటీకరణ చేయాలని భావించడం లేదని, పరిశ్రమలో పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగేందుకు అవసరమైన ప్రక్రియ కొనసాగుతుందని గురువారం ఉదయం ప్రకటించి ప్రజలలో ఆశలు రేకెత్తించి, సాయంత్రానికి మాటమార్చేసారన్నారు. ప్రైవేటీకరణ నిలిపివేసే విషయాన్ని దాటవేసి, స్టీల్‌ప్లాంటుకు లాభాలు రప్పించండని యూనియన్ నాయకులకు, యాజమాన్యానికి హితబోధ చేశారని, ఇంతకంటే మోసం ఇంకొకటి ఉండదని అన్నారు. మనిషి కాళ్లు, చేతులకు బేడీలు వేసి పరిగెత్తమన్నట్లు మంత్రి ప్రకటన ఉందని ఎద్దేవా చేశారు.

బిజెపి ఎంపీ జివిఎల్ నర్సింహారావు శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సిఎండితో చర్చలు జరిపి వర్కింగ్ క్యాపిటల్, ముడిసరుకు సమీకరణకు ఇతరుల మీద, బయట వ్యక్తుల మీద ఆధారపడకుండా ప్లాంటు యాజమాన్యం సమకూర్చుకునే ప్రయత్నం చేయాలని ఉచిత సలహానిచ్చారన్నారు. ప్లాంటు యాజమాన్యమే సమకూర్చుకునే పరిస్థితిని మోడీ సర్కారు కల్పించివుంటే కేంద్రం మీద ఎందుకు ప్లాంట్ ఆధారపడుతుందని అన్నారు. ఒక ఎంపీగా కేంద్రం మీద, బిజెపి అగ్ర నాయకత్వం మీద ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని జివిఎల్‌ను జగ్గునాయుడు ప్రశ్నించారు. ఏమాత్రం చిత్తశుద్ధి, బాధ్యత ఉన్నా స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు, వర్కింగ్ కేపిటల్, ముడిసరుకు సాధించాలని, రైల్వే రేక్స్ రాబట్టాలని, చేతకాకపోతే బాధ్యత నుండి తప్పుకోవాలని అన్నారు. ప్రజలను, ఉక్కు కార్మికులను వంచించడం ఆపాలన్నారు. ఉక్కు మంత్రిత్వ శాఖ శుక్రవారం మరో ప్రకటన చేస్తూ ఆర్ఐఎన్ఎల్ డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ పురోగతిలో ఉందని, ఎలాంటి స్తంభనాలేదని, పెట్టుబడులు ఉపసంహరణ ప్రక్రియ పురోగతిలో ఉందని ప్రకటించడం దారుణమని జగ్గునాయుడు అన్నారు.

రెండు సంవత్సరాల నుంచి బిజెపి పాలకులు వేయి నాల్కలతోనే మాట్లాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగాలని, మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సొంతంగానో, రాజకీయ పక్షాలను కలుపుకునో కేంద్రంపై పోరాడాలన్నారు. ప్రధాన ప్రాంతీయ పార్టీలు కూడా రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి సమైక్యంగా కేంద్రాన్ని నిలదీయాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, పోరాడుతున్న కార్మికవర్గానికి అండగా నిలవాలని కోరారు.

విశాఖ నుంచి వారణాసికి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గంగ పుష్కరాల సమయంలో ప్రయాణికుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - బెనారస్ (వారణాసి) - విశాఖపట్నం మధ్య 08588/08587 వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలని నిర్ణయించింది. 08588 విశాఖపట్నం - బెనారస్ (వారణాసి) వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 19 నుంచి మే 17 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 16.30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. 08587 బెనారస్ (వారణాసి) -విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు ఈ నెల 20 నుంచి మే 18 వరకు ప్రతి గురువారం సాయంత్రం 18.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 20.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఈ రైళ్ళు సింహాచలం, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగఢ్, బలంగీర్, బర్గర్ రోడ్, సంబల్‌పూర్, ఝర్సుగూడ, రూర్కెలా, హతియా, రాంచీ, మురి, బర్కాతోన్, డాన్‌హెర్కానా, లాంజ్‌హెర్కానాడ్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి.



కార్మికులతో మాట్లాడుతున్న పల్లపు వెంకట్

ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జిఒ 549 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు శానిటైజర్ గ్లౌజులు, యూనిఫారాలు, మాస్కులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, పారిశుధ్య కార్మికులు బుల్లమ్మ, రాధ, చందు, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

గుమ్మడవానిపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయతీ గుమ్మడవానిపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఇంటి యజమాని అంగీకారంతో స్టిక్కర్లను డోర్లకు అతికించారు. యజమాని ఫోన్‌తో ముఖ్యమంత్రికి మిస్డ్ కాల్ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి వారా నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ బి.అప్పారావు మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ అందించడానికి వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డౌనూరు సర్పంచ్ పొట్టిక భవాని, మూలపేట సర్పంచ్ నీలాపు సూరిబాబు, పార్టీ నాయకులు పొట్టిక పోతిరాజు, రామ్మూర్తి, ఆగురు జోగిరాజు, సురేష్ పట్నాయక్, లేగుల లక్ష్మి, పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కాకరపాడు నుండి కొయ్యూరు వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు రూ.24 లక్షల నిధులు మంజూరు కాగా, మరమ్మతు పనులు తూతూ మంత్రంగా నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. రహదారి బాగా పాడైపోయిన రెండు మూడు చోట్ల మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని, చిన్న చిన్న గోతులను పూడ్చలేదని స్థానికులు చెబుతున్నారు. రూ.24 లక్షలు మంజూరు కాగా ఆ నిధులకు సరిపడా మరమ్మతు పనులు చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఆర్ అండ్ బి జెఇ వివరణ కోరగా 900 మీటర్ల రోడ్డు మరమ్మతు పనులు చేశామని, దీంతో పూర్తయిందని తెలిపారు. మిగిలిన రంధ్రాలు ఏమైనా ఉంటే తదుపరి పనులలో చేస్తామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతు పనులు పూర్తిస్థాయిలో జరిగేలా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.